క్లుప్తంగా

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఏటూరునాగారం : యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు సుమన్, శ్రావణ్, నాగరాజు, రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాయి ఇసుక క్వారీ నిలిపివేయాలి

- కలెక్టర్ ఆదేశాలు
- పాత ఇసుక రాశులకే అనుమతి



ఏటూరునాగారం: కొండాయి గ్రామానికి ముప్పువాటిల్లే విధంగా చేపట్టిన ఇసుక క్వారీని నిలిపివేయాలని కలెక్టర్ దివాకర్ ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ మహేందర్ జీ తెలిపారు. కొండాయి గ్రామంలో రెండు రోజుల క్రితం ఓ కాంట్రాక్టర్ ఇసుక తరలింపు చర్యలు చేపట్టాడు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు ఇసుక క్వారీని పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా బుధవారం కొండాయి గ్రామాన్ని పరిశీలించడానికి వెళ్లిన అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, తహసీల్దార్ జగదీశ్‌ను ప్రజలు కలుసుకొని ఇసుక క్వారీ వల్ల గ్రామానికి ప్రమాదం ఉందని, గతంలో ఇదే క్వారీ వల్ల వరద నీరు గ్రామాల్లోకి వచ్చి భారీ నష్టం జరిగిందని అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు ఇసుక క్వారీని పరిశీలించి విషయాన్ని కలెక్టర్‌కు చేరవేశారు. క్వారీని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వ పనుల కోసం 2022లో అప్పటి క్వారీ కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను మాత్రమే తరలించేందుకు అనుమతి ఉందని, కొత్తగా ఇసుకను తవ్వకాలు చేపట్టడానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ వెంకన్న, ఆర్ఐ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సతీష్ ఉన్నారు.

నిధులు కేటాయించాలి



ములుగు : జిల్లాలోని గ్రంథాలయాలకు నూతన భవనాలు, పాఠకులకు అవసరమైన పుస్తకాల కొనుగోలుకు, సౌకర్యాలకు నిధులు కేటాయించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ కోరారు. ఈ మేరకు బుధవారం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎండీ రియాజ్ 18 జిల్లాల చైర్మన్లతో ఏర్పాటు చేసి ప్రోటోకాల్‌పై చర్చించారు. సమావేశంలో రవిచందర్ మాట్లాడారు. ఉద్యోగులకు వేతనాల అంశంపై వివరించారు. దీనిపై ఎండీ రియాజ్ సానుకూలంగా స్పందించినట్లు రవిచందర్ తెలిపారు.

టేకు కలప స్వాధీనం



వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని కార్పెంటర్ల ఇళ్లలో బుధవారం తనిఖీలు నిర్వహించగా 26 టేకు కలప(దుంగలు) లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పస్రా రేంజ్ ఆఫీసర్ మాధవి శీతల్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నర్సయ్య, బీట్ ఆఫీసర్ సౌజన్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన నాయకులు

ములుగు : ములుగు డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గోపాల్‌రావును పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్(3194) జిల్లా అధ్యక్షుడు వంగేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. పారామెడికల్ ఉద్యోగుల తరఫున సక్రమంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచిపేరును తీసుకొస్తామని వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వినోద్, దుర్గారావు, సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపత్, సురేష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



వెంకటాపురం(కె): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోహనరావు



ఏటూరునాగారం: శివాపురంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సతీష్‌కుమార్

వెంకటాపురం(కె) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320, కామన్ 'బీ' గ్రేడ్ కు రూ.2,300లు ధర వస్తుందన్నారు. అలాగే క్వింటాకు అదనంగా సన్నాలకు రూ.500లు బోనస్ ఇస్తుందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. రైతులు పంట తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబోసుకోని శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాయం రమణ,సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్లు పల్నాటి ప్రకాశ్, రైతులు చిడెం శివ, జక్కుల సమ్మయ్య, మద్దుకూరి ప్రసాద్ ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం : మండలంలోని శివాపురం గ్రామంలో సెర్ప్ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రైతు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి ప్రభుత్వం కేటాయించిన గిట్టుబాటు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో సీసీలు నర్సింగరావు, సరోజన, సమ్మక్క, వీఓ అధ్యక్షురాలు పుష్పలత, మాజీ సర్పంచ్ వంక దేవేందర్, సీఏ ప్రశాంతి, గ్రామ రైతులు నర్సింహరావు, సమ్మిరెడ్డి, నర్సిరెడ్డి, రామ్మూర్తి, విష్ణుసాయి రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



ములుగు: మాట్లాడుతున్న రాజేందర్ గౌడ్

ములుగు : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాకిటి రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారి వ్యవస్థను నమ్మి మోసపోవద్దని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే రైతుల పార్టీ అన్నారు. రైతు శ్రేయస్సు కోసం అనేక పథకాలను రూపొందించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, ఇందిర జలప్రభ ద్వారా పేద రైతులకు బోర్లు వేయించి సాగు నీరు అందించిందన్నారు. అటవీ హక్కుల చట్టం తెచ్చి పోడు రైతులకు పట్టాలు అందించిందని వెల్లడించారు. రైతులను రాజును చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస రెడ్డి, చింతనిప్పుల భిక్షపతి, పల్లె జైపాల్ రెడ్డి, నూనేటి శ్యామ్, అజ్మీర రంజిత్, శంకరయ్య, సాంబయ్య, నాగరాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

సొసైటీ సొమ్ము దుర్వినియోగం

- నిరుపయోగంగా ఎలక్ట్రానిక్ కాంటాలు



కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద పడేసిన ఎలక్ట్రానిక్ కాంటాలు

ములుగు రూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు నిర్వాహకులకు ఎలక్ట్రానిక్ కాంటాలు అందించారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు ముగిసిన అనంతరం నిర్వాహకులకు అందించిన టార్పాలిన్‌లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, ప్యాడి క్లీనర్‌లను తీసుకొని భద్రపరచాల్సిన సహకార సంఘం ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో సొసైటీ సొమ్ము దుర్వినియోగం అవుతుంది. కల్లాల నిర్వాహకులకు అందించిన ఎలక్ట్రానిక్ కాంటాలను కొనుగోళ్ల అనంతరం పీఏసీఎస్ సీఈఓ నిర్లక్ష్యంతో వేలాది రూపాయలు నీళ్ల పాలవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాంటాలతో పాటు కొనుగోలు కేంద్రాలకు అందించిన గన్ని బ్యాగుల సైతం వాపస్ తీసుకోక పోవడంతో ధాన్యం కొనుగోళ్లపై సొసైటీకి వచ్చే ఆదాయానికి గండి పడుతుంది. గత ఏడాది మండలంలోని కన్నాయిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి అందించిన ఎలక్ట్రానిక్ కాంటాలు గ్రామపంచాయతీ సమీపంలో పడేసి ఉన్నాయి. ఈ విషయంపై ఇన్‌చార్జ్ సీఈఓ ప్రవీణ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. సొసైటీ సొమ్ము దుర్వినియోగంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

ఏటూరునాగారం : ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు చేస్తామని మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటించి, వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు మోసం చేశాడని విమర్శించారు. మాదిగల వ్యతిరేక వైఖరికి నిరసనగా డిసెంబర్ 21న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపడుతున్న కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్, బొర్ర భిక్షపతి, బూర సతీష్, ఇరుగు పైడి, నెమలి నర్సయ్య, మడిపల్లి శ్యాం, గజ్జెల ప్రసాద్, పుల్లూరి కరుణాకర్, సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, గోపి, వేంపల్లి జాషువ, రమేష్, ఉపేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర సర్వే చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సృజన్ కుమార్

గోవిందరావుపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన, సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పస్రాలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఎంపీడీఓ జవహర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సర్వే అనంతరం కచ్చితంగా స్టిక్కరింగ్ చేయాలని సూచించారు. స్టిక్కరింగ్ ఆధారంగా ఇంటి వివరాలు పూర్తి స్థాయిలో సేకరించినట్లు నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

'కులగణన పేరుతో ప్రభుత్వం దగా'



మాట్లాడుతున్న ఎల్కతుర్తి రాజన్న

ములుగు : కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను దగా చేస్తోందని విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల్లో ఐదు రకాల చేతివృత్తి దారులు ఉన్నారని, వారందరిని విడదీయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. విశ్వబ్రాహ్మణులపై దాడులు చేయడాన్ని మానుకోవాలని అన్నారు. సమావేశంలో కడివెండి వీరాచారి, శీలమంతుల నరసింహాచారి, బట్టోజు మహేష్, ఎల్కతుర్తి శ్రీహరి, ముగులోజు రమేష్, ఎర్రోజు రవీంద్రాచారి, రామగిరి శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



ములుగు: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సందీప్‌రెడ్డి



ఏటూరునాగారంలో..

ములుగు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సందీప్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ భవన్‌లో సీనియర్ సిటిజన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం లావాదేవీలు, అపరిచితులకు బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీ నంబర్‌లు చెప్పడం, ఆన్‌లైన్ లింకుపై క్లిక్ చేయడం, లోన్‌యాప్‌ల ఉచ్చులో పడడం లాంటి వాటికి స్పందించకుండా ఉండాలని అన్నారు. ఒకవేళ సైబర్ నేరంలో మోసపోయినట్లుగా గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు వెల్లడించాలని ఇన్‌స్పెక్టర్ యాసిన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ ఇన్‌స్పెక్టర్ యాసిన్, ములుగు సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన ఉండాలని సైబర్ క్రైమ్ వారియర్స్ కానిస్టేబుల్ మెట్టు శ్రీనివాస్, హరీష్ అన్నారు. బుధవారం మండలంలోని రొయ్యూర్ గ్రామంలో సీనియర్ సిటిజన్ దివస్ అవగాహన సదస్సులో ఎస్సై తాజొద్దీన్ సూచనల మేరకు సైబర్ నేరాల నియంత్రణపై వారు అవగాహన కల్పించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, రాంగ్ కాల్స్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దన్నారు. అంతేకాకుండా బ్యాంక్ పిన్ నంబర్లు ఇవ్వొద్దని తెలిపారు.

గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ



గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న బాధ్యులు

వాజేడు : మండల పరిధిలోని బొల్లారం గ్రామంలోని ది కేర్ సెంటర్ విద్యార్థులకు బుధవారం బిస్కెట్లు, గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. జీఎస్ఎస్ సంస్థ సూపర్ వైజర్ మురళి రెడ్డి ప్రసాద్ చేతుల మీదుగా 63 మందికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శ్యామ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లు విడుదల చేయాలి

కన్నాయిగూడెం : గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు దుర్గం రాజుకుమార్ డిమాండ్ చేశారు. బిల్లులు అడిగితే సర్పంచ్‌లను అక్రమ అరెస్టులు చేసి నిర్బంధిస్తుందన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమిలో పంటలు సాగుచేయొద్దు



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అధికారులు



భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ఎక్కెల సమీపంలో గల 92, 96, 146/2 సర్వే నంబర్లలోని సెరికల్చర్ ప్రభుత్వ భూమిలో కొంత మంది రాత్రికి రాత్రే పంటలు సాగు చేశారని తహసీల్దార్ జగదీశ్, సెరికల్చర్ అధికారి మాచర్ల నరేందర్ అన్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు బుధవారం అక్రమంగా పంటలు వేసిన భూమిలో డోజర్‌తో వాటిని తొలగించారు. పోలీసులు బందోబస్తు మధ్య ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించారు. ఈసందర్భంగా సెరికల్చర్ అధికారి నరేందర్ మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు చెందిన భూమిలో మండల కేంద్రానికి చెందిన ఈసం మహలక్ష్మి, బూర్గ చంద్రకళ, దుబ్బ కన్నమ్మలు అక్రమంగా రాత్రికి రాత్రే మొక్కజొన్న, మినుములు వేశారన్నారు. వారిని ప్రశ్నించగా దౌర్జన్యంగా మాట్లాడారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బోర్డు కూడా ఏర్పాటు చేశామని నరేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిక్కుల కిరణ్, పాలకుర్తి సదానందం, గంపల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

ములుగు : రాష్ట్రీయ బాలస్వస్థ కిషోర్, అనిమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని బాలసదనంలో విద్యార్థులకు ఆర్బీఎస్‌కే వైద్యులు శ్రీలత, మల్లికార్జున్ రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేసుకున్నారు. ఆర్బీఎస్‌కే సేవల గురించి బాలసదనం సూపరింటెండెంట్ సుమతికి వివరించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ మాధురి, ఏఎన్ఎం సుహాసిని పాల్గొన్నారు.

చేపపిల్లలతో గిరిజన సొసైటీలకు లబ్ధి

- మత్స్య శాఖ అధికారి అవినాష్



చేపపిల్లలను వదులుతున్న నాయకులు,అధికారులు

కన్నాయిగూడెం : ప్రభుత్వం ఉచితంగా అందించే చేపపిల్లలతో గిరిజన సొసైటీలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని మత్స్య శాఖ అధికారి అవినాష్ అన్నారు. బుధవారం మండలంలోని తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీలో గిరిజన సొసైటీల ఆధ్వర్యంలో మత్స్య శాఖ అధికారులు 11,02,500 చేప పిల్లలను గోదావరిలో వదిలారు. కట్ల చేపలు 4,41,000 కాగా, రవ్వలు 5,51,250, మెరిగే రకం 5,40,000 చేపపిల్లలను గిరిజన సొసైటీలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసా కోఆర్డినేటర్ ప్రభాకర్, తుపాకులగూడెం మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, మత్స్య శాఖ జిల్లా విస్తరణ అధికారి రమేష్, మత్స్య శాఖ గిరిజన సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి కోరం సమ్మయ్య, చందర్‌రావు, కేశ్వర్‌రావు, రవీందర్, శ్రీను, రామరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కాటారం : కాటారం సబ్ డివిజన్‌లో నేడు(గురువారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. మల్హర్ మండలం కొండంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, కాటారం మండలం ధన్వాడ సమీపంలోని మీనాక్షి కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో రెడ్డిగాండ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి ఆత్మీయ సన్మానంలో మంత్రి పాల్గొననున్నారు.

దొంగలు దొరికారు..

- గుప్తనిధుల తవ్వకాలు ఇంటి దొంగల పనేనా..
- పోలీసుల అదుపులో 8మంది దుండగులు?

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయం ఎదురుగల గొల్లాల గుడిలో సెప్టెంబర్ 23న గుప్త నిధుల కోసం కొంతమంది వ్యక్తులు తవ్వకాలు జరిపారు. వజ్రాలు ఉంటాయనే నెపంతో ఆలయం పైకప్పుకు చెందిన శిల్పాన్ని సైతం ధ్వంసం చేశారు. ప్రధాన ఆలయం ఎదుటే తవ్వకాలు జరిపి శిల్పాలను ధ్వంసం చేయడంతో పురావస్తుశాఖ అధికారులు వెంకటాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇందులో పురావస్తుశాఖకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంటి దొంగల సమాచారంతోనే పాలంపేటకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు, బయ్యారానికి చెందిన మరో నలుగురు కలిసి గొల్లాల గుడిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి వజ్రాల కోసం శిల్పాలను ధ్వంసం చేసినట్లు సమాచారం. 8 మంది దుండగులను విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయమై ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా.. గొల్లాల గుడిలో తవ్వకాలు జరిపిన నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

నేతకానిలను ఎస్సీ-ఏలో ఉంచాలి



మాట్లాడుతున్న నేతకాని నాయకులు

వాజేడు : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే నేతకాని కులాన్ని ఏ,బీ,సీ,డీలోని ఏ కేటగిరిలో ఉంచాలని నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కావేరి చిన్ని కృష్ణ, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య సూచించారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో బుధవారం నేతకాని కుల రాష్ట్ర కమిటీ సమావేశాన్ని మండల అధ్యక్షుడు చెన్నూరు వినోద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే ఏ,బీ,సీ,డీలోని ఏ కేటగిరి నేతకాని కులాన్ని ఉంచాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రాబోయే రోజుల్లో సంఘం ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుంచి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మల్లయ్య, నరేందర్, గణపతి, వెంకటయ్య, గంగరాజు, తిరుపతి, నవీన్, రామ్మూర్తి, లక్ష్మయ్య ఉన్నారు.

గేట్‌వాల్వ్‌కు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె) : గేట్ వాల్వ్ లీకేజీతో కలుషితమవుతున్న తాగు నీరు అనే సాక్షి వార్త కథనానికి బుధవారం అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి వాటర్ ట్యాంక్ వద్ద గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు చేయడంతో పాటు పెరిక బజార్‌లో లీకేజీ అవుతున్న పైపులైన్‌కు సైతం మరమ్మతు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది లక్ష్మణరావు, బుచ్చిబాబు, మోహన్, రెడ్డి తదితరులు ఉన్నారు.

సాక్షి స్పందన